సాక్షి అనంతపురం

శనివారం । 3 । ఫిబ్రవరి । 2024



ఏఆర్ పాత్ర కీలకం

శాంతిభద్రతల పరిరక్షణలో ఏఆర్ పోలీసుల పాత్ర చాలా కీలకమని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. 8లో



కిలో టమాట రూ.18

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.18, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.12 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం

34.8°/16.3°

జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం వేళ చలి వాతావరణం కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రణాళికాబద్ధంగా చదవాలి



కొర్రకోడు నూతన భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఈఓ నాగరాజు

కూడేరు: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని డీఈఓ నాగరాజు సూచించారు. శుక్రవారం కొర్రకోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈఓ తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో సమావేశమై పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. బట్టీ విధానానికి స్వస్తి పలికి ఏకాగ్రతతో చదవాలని తెలిపారు. ఇంటి వద్ద టీవీలు చూస్తూ, ఆటలు ఆడుతూ సమయాన్ని వృథా చేయవద్దన్నారు. పదో తరగతి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధిస్తే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం నాడు–నేడు కింద రెండో విడతలో రూ.1.40 కోట్లతో నిర్మిస్తున్న హైస్కూల్ భవన నిర్మాణ పనులను డీఈఓ పరిశీలించారు. పనులను నాణ్యతగా చేయించాలని కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం విజయలక్ష్మి, స్కూల్ కమిటీ వైస్ చైర్మన్ గోపాల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పది'లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



మాట్లాడుతున్న డీడీ కుష్బూకొఠారి

అనంతపురం రూరల్: పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా వార్డెన్లు పని చేయాలని బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూ కొఠారి సూచించారు. శుక్రవారం శింగనమలతో పాటు అనంతపురంలోని బీసీ వసతి గృహాల్లో వార్డెన్లతో సమావేశం నిర్వహించారు. పరీక్షలపై విద్యార్థుల్లో నెలకొన్న ఆందోళన తొలగిపోయే విధంగా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ట్యూటర్లను ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ప్రతి హాస్టల్‌లోనూ వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా వార్డెన్లు పని చేయాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

10న నవోదయ ప్రవేశ పరీక్ష



లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈ నెల 10న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఈ మేరకు న్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. 9వ తరగతి ప్రవేశ పరీక్షకు 1003 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. వీరికి నవోదయ విద్యాలయంలోనే ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేరోజే ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి లేపాక్షిలోని మహాత్మాజ్యోతిభాపూలే గురుకుల పాఠశాల, కళాశాలలో పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షకు 619 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 11 గంటలకు కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

ఫాస్ట్‌ట్యాగ్‌కు కేవైసీ గడువు పొడిగింపు



హిందూపురం అర్బన్: ఫాస్ట్‌ట్యాగ్ వినియోగదారులు కేవైసీ అప్‌డేట్ చేయడానికి ఈ నెల 29 వరకు గడువు పొడిగించినట్లు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు తెలిపారు. 'వన్ వెహికల్..వన్ ఫాస్ట్ ట్యాగ్' విధానానికి శ్రీకారం చుట్టిన నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఫాస్ట్ ట్యాగ్‌కు కేవైసీ తప్పనిసరి చేసింది. ఫాస్ట్ ట్యాగ్ కేవైసీ పూర్తి చేసేందుకు జనవరి 31 వరకూ గడువు ఇచ్చింది. కానీ వివిధ కారణాలతో చాలామంది వాహనదారులు గడువులోపు కేవైసీ చేసుకోలేకపోయారు. దీంతో గడువును మరో నెల పొడిగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. గడువు తేదీ తర్వాత కేవైసీ చేయని ఫాస్ట్‌ట్యాగ్ పనిచేయదని తెలిపారు.

చదువు.. సంపాదించు

- ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్సెస్ విద్యార్థులకు అవకాశం
- ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్‌గా సేవలు
- విద్యార్థులు, ఉపాధ్యాయులకు 'స్మార్ట్ బోధనపై శిక్షణ
- ఇంటర్న్‌షిప్ సమయంలో నెలకు రూ.12 వేల స్టైఫండ్
- జేఎన్‌టీయూఏ పరిధిలో 1,014 మంది విద్యార్థుల ఎంపిక



ఇంటర్న్‌షిప్‌పై ఇంజినీరింగ్ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

అనంతపురం: ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్సెస్ విద్యార్థులను భవిష్యత్ నైపుణ్య నిపుణులు (ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్)గా వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. బీటెక్, ఎంటెక్‌తో పాటు ఎంసీఏ కోర్సుల్లో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం కల్పించింది. ముఖ్యంగా కంప్యూటర్ సైన్సెస్ విద్యార్థులకు ప్రాధాన్యం కల్పించారు. దీని తర్వాత అవసరాన్ని బట్టి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ), మెకానికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్ విద్యార్థులను పరిశీలిస్తారు. దేశంలోనే ఇలాంటి కార్యక్రమం అమలు చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుంది.

3,024 పాఠశాలలకు 1,014 మంది విద్యార్థులు

జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని ఉమ్మడి అనంతపురం, కర్నూలు, చిత్తూరు, వైఎస్సార్, నెల్లూరు జిల్లాల్లోని 44 ఇంజినీరింగ్ కళాశాలల్లో మొత్తం 1,014 మంది విద్యార్థులను ఇంటర్న్‌షిప్‌కు ఎంపిక చేశారు. వీరిని మొత్తం 3,042 ఉన్నత పాఠశాలలకు కేటాయించారు. ఈ నేపథ్యంలో ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్‌లో భాగంగా ఒక్కో ఇంజినీరింగ్ విద్యార్థి నాలుగు నెలల పాటు ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పిస్తారు. ఒక్కో ఇంజినీరింగ్ విద్యార్థికి మూడు ఉన్నత పాఠశాలలను కేటాయించారు. వారానికి రెండు రోజులు పాఠశాలకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ట్యాబ్‌ల వాడకం, ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ తరగతులు, స్మార్ట్ క్లాసుల బోధనపై శిక్షణ ఇస్తారు. నాలుగు నెలల ఇంటర్న్‌షిప్ కాలంలో నెలకు రూ.12 వేలు స్టైఫండ్ చెల్లిస్తారు.

'వర్చువల్'లో మరో ఇంటర్న్‌షిప్

రాష్ట్రంలో ప్రతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలనూ సమీపంలోని ఇంజినీరింగ్ కళాశాలతో జత చేశారు. ఇప్పటికే కళాశాలల మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఉన్నత పాఠశాలలో ఇంటర్న్‌గా చేస్తూనే వర్చువల్ విధానంలో కూడా మరో ఇంటర్న్‌షిప్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. భవిష్యత్తులో బోధన రంగంలో రాణించాలనుకునే వారికి, జాబ్ మార్కెట్ ఓరియంటెడ్ కోర్సులు నేర్చుకోవాలనుకునే వారికి రెండు విధాలా ఇంటర్న్‌షిప్ దోహదపడుతుంది. వాస్తవానికి విద్యార్థి దశలోనే ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాన్ని సాధించడానికి ప్రభుత్వం ఉన్నత విద్యలో ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే.

ఇప్పటికే ఏటీఎల్ మెంటార్‌షిప్

ఉన్నత విద్యలో కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ కింద ఇంజినీరింగ్ విద్యార్థులు ఇప్పటికే హైస్కూల్ బాటపడుతున్నారు. రెండు నెలల పాటు కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ ఉంటుంది. ఇందులో భాగంగా హైస్కూళ్లలో 'అటల్ టింకరింగ్ ల్యాబ్' (ఏటీఎల్)కు మెంటార్‌షిప్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఈ కోర్సుల్లోనే శిక్షణ

ఫ్యూచర్ స్కిల్ ప్రోగ్రామ్‌లో భాగంగా విద్యార్థులకు ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్), బ్లాక్ చైన్ టెక్నాలజీ, వర్చువల్ రియాలిటీ (వీఆర్), అగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), మెటావర్స్/వెబ్ 3.0, మోడలింగ్ అండ్ ప్రింటింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, బిగ్ డేటా/డేటా ఎనలిస్ట్, రోబోటిక్స్‌లో బేసిక్స్ బోధించనున్నారు. దీని ద్వారా ఇంజినీరింగ్ విద్యార్థుల సహాయంతో బేసిక్స్ నేర్పిస్తూనే.. పాఠశాల ఉపాధ్యాయులకు డిజిటల్ పరికరాలపై విద్యా బోధన, హైస్కూల్ విద్యార్థులకు ట్యాబ్స్ వినియోగంపై శిక్షణ కల్పిస్తున్నారు. అలాగే కొత్త కంటెంట్ ఇన్‌స్టాల్ చేసి అందిస్తారు.

చదువుతో పాటే సంపాదన



దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర విద్యార్థులు చదువుతో పాటే సంపాదించనున్నారు. ప్రభుత్వ హైస్కూళ్లలో స్టైఫండ్‌తో కూడిన ఇంటర్న్‌షిప్ ఓ గొప్ప మార్పునకు నాంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో చేపట్టిన విప్లవాత్మక మార్పులతోనే ప్రభుత్వ బడుల్లో డిజిటల్ లిటరసీ పెరుగుతోంది. విద్యార్థులు స్మార్ట్ ప్యానల్స్‌పై పాఠాలు వింటున్నారు. వీటి ద్వారా మరింత నాణ్యమైన సాంకేతిక పాఠాలను నేర్పించేందుకు ఇంజినీరింగ్ విద్యార్థులను ఉన్నత పాఠశాలల్లో ఇంటర్న్‌షిప్‌కు పంపాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నాం.

–ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాసరావు, వీసీ, జేఎన్‌టీయూ అనంతపురం

ఇంజినీరింగ్ విద్యార్థులకు క్రెడిట్లు



జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఫ్యూచర్ స్కిల్ ప్రోగ్రాంకు సంబంధించి 785 మంది విద్యార్థులను ఎంపిక చేశాం. నెలకు రూ.12 వేల స్టైఫండ్‌తో పాటు వారికి ఇంజినీరింగ్ డిగ్రీలో క్రెడిట్స్ కూడా కలుపుతాం. బీటెక్ కంప్యూటర్ సైన్సెస్ చివరి సంవత్సరం విద్యార్థులను ఫ్యూచర్ స్కిల్ ప్రోగ్రాంకు ఎంపిక చేశాం. ఇంటర్న్‌షిప్‌కు స్టైఫండ్ కల్పిస్తూ ఉన్నత పాఠశాలలో సాంకేతిక విద్యను అందించే బృహత్తర పథకాన్ని అమలు చేసే రీతిలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విధానం దేశ చరిత్రలోనే తొలిసారి కావడం గర్వకారణం.

– ప్రొఫెసర్ సి. శశిధర్, రిజిస్ట్రార్, జేఎన్‌టీయూ అనంతపురం

ఇంజినీరింగ్ విద్యార్థులకు వరం



ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్ ఇంటర్న్‌షిప్ ఇంజినీరింగ్ విద్యార్థులకు వరం లాంటిది. కోర్సు చేస్తూనే ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పించారు. ఒక్కో ఇంజినీరింగ్ విద్యార్థికి ఆసక్తి గల సబ్జెక్టును ఎంపిక చేసుకునే అవకాశంతో పాటు ఇంజినీరింగ్ కళాశాలకు సమీపంలోని ఉన్నత పాఠశాలకు కేటాయించాం. విద్యార్థులకు పర్యవేక్షణతో పాటు మార్గదర్శకత్వం ఎప్పటికప్పుడు చేస్తున్నాం.

– డాక్టర్ మాధవి, ఫ్యూచర్ స్కిల్ కోఆర్డినేటర్, జేఎన్‌టీయూ

సిగరెట్ల లారీ పట్టివేత

- బిహార్ నుంచి మధురైకు అక్రమ రవాణా
- మరూరు టోల్‌గేట్ వద్ద జీఎస్టీ అధికారుల దాడి
- రూ.3.48 కోట్ల విలువ చేసే సిగరెట్లు సీజ్



సిగరెట్ల బండిళ్లను సీజ్ చేసిన జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ అనిత, సిబ్బంది

అనంతపురం సిటీ: సిగరెట్లను అక్రమంగా తరలిస్తున్న లారీని జీఎస్టీ అధికారులు పట్టుకున్నారు. బెంగళూరు–హైదరాబాద్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 44)లో సిగరెట్లను అక్రమంగా తరలిస్తున్నారని జీఎస్టీ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు ఆ శాఖ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ జి.అనిత తమ బృందంతో గురువారం రాత్రంతా కాపు కాశారు. శుక్రవారం తెల్లవారుజామున అనంతపురం సమీపాన మరూరు టోల్‌ప్లాజా వద్ద బిహార్ నుంచి మధురైకు వెళ్తున్న లారీని ఆపి సోదాలు చేశారు. అందులో గోల్డ్ స్టెప్ ఫిల్టర్, ప్యారిస్ వంటి బ్రాండ్లకు చెందిన సిగరెట్ల బండిళ్లను గుర్తించారు. వీటి విలువ దాదాపు రూ.3.48 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. వీటికి సంబంధించి ఎటువంటి పత్రాలూ లేకపోవడంతో లారీలో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. సిగరెట్లను జీఎస్టీ కార్యాలయ గోదాములో భద్రపరచి సీజ్ చేశారు. లారీని స్వాధీనం చేసుకున్నారు. కేసును లోతుగా విచారణ చేపట్టినట్లు సహాయ కమిషనర్ అనిత వెల్లడించారు.

ఉద్యాన శాఖ ఏడీ రఘునాథ్‌రెడ్డికి పదోన్నతి



అనంతపురం అగ్రికల్చర్: ఉద్యాన శాఖ ఏడీ బి.రఘునాథరెడ్డికి డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా పదోన్నతి లభించింది. ఈ మేరకు కమిషనరేట్ నుంచి రెండు మూడు రోజుల్లో ఉత్తర్వులు వెలువడనున్నాయి. పదోన్నతి బదిలీలో భాగంగా రఘునాథరెడ్డిని ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమించే అవకాశం ఉన్నట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రీదేవి

అనంతపురం అర్బన్: సాధారణ ఎన్నికలు–2024 నిర్వహణకు పకడ్బందీ చర్యలు చేపట్టామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ మీనాకు కలెక్టర్ గౌతమి తెలిపారు. ఎన్నికల సన్నద్ధత, ఓటరు జాబితా క్లెయిమ్‌ల పరిష్కారం తదితర అంశాలపై సీఈఓ శుక్రవారం విజయవాడ నుంచి కలెక్టర్లతో సమీక్షించారు. అనంతపురం కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయత్రీదేవి పాల్గొన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణ, క్లెయిమ్‌ల పరిష్కారంపై సీఈఓకు కలెక్టర్ వివరించారు. ఓటరు జాబితాలో డూప్లికేట్, డెత్ కేసులు, 10 కంటే ఎక్కువ ఉన్న ఓట్లు, తదితర వాటికి సంబంధించి కొన్ని క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులపై రోజూ మానిటర్ చేస్తున్నామన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే సెక్టోరియల్ అధికారులకు, ఏఎల్‌ఎంటీలకు శిక్షణ ఇచ్చామని, రెండో విడత శిక్షణ వచ్చే వారంలో నిర్వహించనున్నామన్నారు. జిల్లాలో పోలింగ్ సిబ్బంది ఏర్పాటు, అదనపు పోలింగ్ సిబ్బంది గుర్తింపు ప్రక్రియ పూర్తి చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన చేపట్టామని, వారంలోగా పనులు పూర్తి చేస్తామన్నారు. జిల్లాలో మద్యం, డబ్బు అక్రమ రవాణా జరగకుండా సరిహద్దు చెక్‌పోస్టులను బలోపేతం చేశామన్నారు. ఎన్నికలకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు అవసరమైన అన్ని చర్యలూ చేపట్టామన్నారు.

ఎలక్టోరల్ సమస్యలు పరిష్కరించాలి

సీఈఓ సమీక్ష అనంతరం ఈఆర్‌ఓలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలని చెప్పారు. పోలింగ్ స్టేషన్ వారీగా ఎలక్టోరల్ రోల్ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. క్లెయిమ్‌లను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని చెప్పారు. సమావేశంలో ఆర్‌డీఓలు గ్రంధి వెంకటేష్, రాణీసుస్మిత, శ్రీనివాసులురెడ్డి, ఈఆర్‌ఓలు వెంకటేశ్వర్లు, కరుణ కుమారి, వెంకటనారాయణమ్మ, వరప్రసాద్, డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్, డీఐఓ రవిశంకర్, ఎన్నికల సెల్ ఎస్‌ఏ శామ్యూల్ బెంజిమన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జంతువులపై క్రూరత్వం అమానుషం



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నిదియాదేవి

అనంతపురం అర్బన్: 'జంతువులను మనం ఎంత ప్రేమిస్తే.. మనపై అవి రెట్టింపు ప్రేమను చూపుతాయి. అలాంటి జంతువులపై క్రూరత్వం ప్రదర్శించడం అమానుషం' అని జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జంతువులపై క్రూరత్వాన్ని నిరోధించేందుకు ఏర్పాటైన జిల్లా సంఘం సమావేశానికి సీఈఓ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఈఓ మాట్లాడుతూ జంతువులను హింసించడం... వాటితో క్రూరంగా ప్రవర్తించడం సరికాదన్నారు. జంతువులపై క్రూరత్వాన్ని నిరోధించడం కర్తవ్యంగా భావించి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సంఘం విధి విధానాలను సభ్యులకు పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రమణ్యం వివరించారు. సంఘానికి రెడ్డిపల్లిలోని విత్తనోత్పత్తి క్షేత్రంలో ఐదు ఎకరాలు భూమిని కేటాయించారన్నారు. ఉపాధి హామీ పథకం కింద రూ.25 లక్షల నిధులతో షెడ్లు నిర్మిస్తామన్నారు. క్రూరత్వానికి గురైన పశువులు, గొర్రెలు, మేకలు, తదితర జంతువులకు షెడ్లలో తాత్కాలిక బస ఏర్పాటు చేస్తామన్నారు. షెడ్ల నిర్మాణానికి పరిపాలన అనుమతి మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. స్వచ్ఛంద సంస్థలు, జంతు ప్రేమికులను ఐదుగురిని సంఘం సభ్యులుగా నియమించేందుకు కమిటీ ఆమోదం తెలిపింది. కమిటీలో సభ్యులుగా ఉన్న వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

5,476 మందికి వైద్య సేవలు

అనంతపురం మెడికల్: జిల్లాలోని 12 ప్రాంతాల్లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. 5,476 మందికి వైద్య సేవలందించినట్లు డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి తెలిపారు. వీరిలో ఒక కేసును జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు చెప్పారు. 262 మందికి వైఎస్సార్ కంటి వెలుగు కింద వైద్య పరీక్షలు చేసినట్లు వెల్లడించారు.

ఇంటర్ విద్యార్థులకు నేటి పరీక్ష 23కు వాయిదా

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు శనివారం జరగాల్సిన 'పర్యావరణ విద్య' పరీక్ష వాయిదా పడింది. అనివార్య కారణాల వల్ల ఈ పరీక్షను ఈ నెల 23న నిర్వహించేలా బోర్డు నిర్ణయించిందని ఇంటర్మీడియెట్ పరీక్షల జిల్లా కన్వీనర్ వెంకటరమణ నాయక్ తెలియజేశారు.

'నైతికత–మానవతా విలువలు' పరీక్ష ప్రశాంతం

శుక్రవారం ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన 'నైతికత–మానవతా విలువలు' పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 143 జూనియర్ కళాశాలల్లో 24,386 మంది విద్యార్థులకు గాను 23,784 మంది హాజరయ్యారు. 602 మంది గైర్హాజరయ్యారు. లోటుపాట్లు తలెత్తకుండా ప్రశాంతంగా జరిగిందని వెంకటరమణ నాయక్ తెలిపారు.

పవర్ టిల్లర్ యంత్రాలపై సమీక్ష



పవర్ టిల్లర్ యంత్రాలపై సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

గార్లదిన్నె: మండల పరిధిలోని దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరీక్షణ సంస్థ (ట్రాక్టర్ నగర్)లో ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ బాలాజీ మురారి నాందేడే అధ్యక్షతన బీఐఎస్ అధికారుల సమక్షంలో శుక్రవారం పవర్ టిల్లర్ యంత్రాలపై సమీక్ష నిర్వహించారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్, అధికారులు, పవర్ టిల్లర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, పవర్ టిల్లర్ తయారీదారులు పాల్గొన్నారు. డైరెక్టర్ డాక్టర్ బాలాజీ మురారి నాందేడే మాట్లాడుతూ నేల రకాలను బట్టి, పంటలు, వ్యవసాయ పద్ధతులు, ఆయా యంత్రాల భారత ప్రమాణాలకు అనుగుణంగా బీఐఎస్ టెస్ట్ కోడ్‌లను పరిశీలించి, వాటిలో నూతన సాంకేతికత అవసరాలకు సరిపడే విధంగా మార్పులు, సలహాలు సూచించారన్నారు. కార్యక్రమంలో దేశంలోని అన్ని పవర్ టిల్లర్ కంపెనీ ప్రతినిధులు, ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్ భోపాల్ నుంచి డాక్టర్ కేఎస్ అగర్వాల్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ నుంచి డాక్టర్ సురేందర్‌సింగ్, శాస్త్రవేత్త విక్రాంత్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

తుంకూరు రైలుమార్గానికి రూ.250 కోట్లు



రాయదుర్గంటౌన్: రాయదుర్గం–తుంకూరు రైలుమార్గం నిర్మాణానికి రైల్వే బడ్జెట్‌లో రూ.250 కోట్ల నిధులు కేటాయించారు. ఈ మేరకు నైరుతి రైల్వే ముఖ్య సమాచార అధికారి మంజునాథ కనమడి ఒక ప్రకటన విడుదల చేశారు. తుంకూరు – రాయదుర్గం నూతన బ్రాడ్‌గేజ్ రైలులైను పనులు 207 కిలోమీటర్ల పరిధిలో జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌కు అయ్యే ఖర్చును రైల్వేశాఖ, కర్ణాటక, ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వాలు వారి భూభాగంలో 50:50 శాతం నిష్పత్తి ఆధారంగా పంచుకుని నిర్మాణం చేసుకుంటున్నాయి. బడ్జెట్‌లో ప్రతిసారి తక్కువ నిధులు విడుదలవుతున్న క్రమంలో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ప్రాజెక్ట్ వ్యయం కూడా పెరుగుతూ వచ్చింది. ఇప్పటి వరకు రాయదుర్గం నుంచి కళ్యాణదుర్గం, కదిరిదేవరపల్లి, దొడ్డహళ్లి వరకు పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం రాయదుర్గం నుంచి ఆవులదట్ల, కళ్యాణదుర్గం మీదుగా కదిరిదేవరపల్లి వరకు రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. కొట్టాళం, మడకశిర వరకు రైల్వే లైను పనులు పూర్తయితే ఆంధ్రా సెక్షన్ పూర్తవుతుంది. కర్ణాటకలో కూడా అవసరమైన చోట్ల భూ సేకరణ, బ్రిడ్జిల నిర్మాణ, ఇతరత్ర పనులు జరుగుతున్నాయి.

హంద్రీ–నీవా కాలువ పటిష్టతకు చర్యలు



జీడిపల్లి రిజర్వాయర్ వద్ద కృష్ణాజలాల ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఈఎన్‌సీ నారాయణరెడ్డి

అనంతపురం సెంట్రల్: జీడిపల్లి రిజర్వాయర్‌ను జల వనరుల శాఖ ఈఎన్‌సీ (ఇంజినీరింగ్ చీఫ్) సి.నారాయణరెడ్డి శుక్రవారం పరిశీలించారు. అనంతరం గొల్లపల్లి రిజర్వాయర్ వరకు హంద్రీ–నీవా కాలువ గట్టుపై పర్యటించారు. నీటి ప్రవాహానికి ఇబ్బందులు తలెత్తకుండా హంద్రీ–నీవా కాలువ పటిష్టతకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం హంద్రీ–నీవా ద్వారా జిల్లా సరిహద్దులోకి 841 క్యూసెక్కుల నీరు వస్తోంది. జీడిపల్లి రిజర్వాయర్‌కు 469 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. తక్కువ సమయంలో ఎక్కువ నీటిని తీసుకోవడంతో పాటు చివరి వరకు నీటిని ఎలా తరలించడం, నీటి నిల్వ తదితర అంశాలపై అంశాలపై అధికారులతో చర్చించారు. అన్ని ప్రాంతాలకూ సమానంగా నీటిని అందించి, ముఖ్యంగా తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రాధాన్యత ప్రకారం అవసరాలు ఉన్న ప్రాంతాలకు నీటిని పంపిణీ చేయాలని ఆదేశించారు. భవిష్యత్‌లో మరింత ఎక్కువ నీటిని అందించే ప్రాజెక్టుగా హంద్రీ–నీవాను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జలవనరులశాఖ సీఈ శ్రీనివాసులరెడ్డి, హంద్రీ–నీవా ఎస్‌ఈ దేశేనాయక్ పాల్గొన్నారు.

13 నుంచి సేవాలాల్ జయంత్యుత్సవాలు

- జిల్లా యంత్రాంగం సంపూర్ణ సహకారం



చలో సేవాఘడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో టీటీడీ పాలక మండలి సభ్యుడు అశ్వత్థనాయక్, డీటీడబ్ల్యూఓ రామాంజినేయులు, తదితరులు

అనంతపురం అర్బన్: బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 285వ జయంత్యుత్సవాలు ఈ నెల 13 నుంచి గుత్తి మండలం సేవాఘడ్‌లో ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల విజయవంతానికి జిల్లా అధికార యంత్రాంగం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని కలెక్టర్ గౌతమి తెలిపారు. మూడు రోజులపాటు సాగే జయంత్యుత్సవాల పోస్టర్లను శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లూ పకడ్బందీగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, సేవాఘడ్ ట్రస్ట్ ఉపాధ్యక్షుడు కేశవనాయక్, ప్రధాన కార్యదర్శి, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వర్థనాయక్, కోశాధికారి బాలనాయక్, తదితరులు పాల్గొన్నారు.

నాడు దుర్భిక్షం... నేడు సస్యశ్యామలం

- చంద్రబాబు హయాంలో వర్షాలు లేక భారీగా పతనమైన భూగర్భ జలం
- 2014–2018 మధ్య వాల్టా పరిధిలోకి 475 గ్రామాలు
- భారీ వర్షాలతో నాలుగేళ్లలో ఉప్పొంగిన గంగ
- గణనీయంగా తగ్గిన వాల్టా పరిధి



అనంతపురం అగ్రికల్చర్: గత నాలుగున్నరేళ్లుగా విస్తారమైన వర్షాలతో భూగర్భజలాలు గణనీయంగా పెరిగి ఉమ్మడి జిల్లా పరిధిలో వాల్టా చట్టం పరిధిలోని గ్రామాల సంఖ్య పూర్తిగా తగ్గింది. 2014–2018 మధ్య చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో భూగర్భజలాలు పూర్తిగా క్షీణించిపోయాయి. ఒకానొక సమయంలో జిల్లా సగటు నీటి మట్టం చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 27 మీటర్లకు పతనం కావడంతో తీవ్ర ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. దాదాపు చంద్రబాబు పాలించిన ఐదేళ్లూ సగటు నీటి మట్టం 18 నుంచి 27 మీటర్ల మధ్య నమోదవుతూ వచ్చింది. ఇందులో కొన్ని ప్రాంతాల్లో ఏకంగా 60 నుంచి 90 మీటర్ల అత్యంత కనిష్ట స్థాయికి చేరుకోవడం గమనార్హం. దీంతో అప్పట్లో వాల్టా గ్రామాల సంఖ్య 400 నుంచి 500 వరకు చేరుకుంది. వాల్టా పరిధి ప్రకటించిన గ్రామాల్లో వ్యవసాయానికి కొత్తగా బోరుబావులు తవ్వడానికి వీలులేదు. అలాగే ఇసుక తవ్వకం, మైనింగ్ లాంటి వాటికీ అనుమతులు ఉండవు. ఏదైనా అత్యవసరమయితే తాగునీటి అవసరాలకు మాత్రమే ఉన్నతాధికారుల అనుమతితో బోర్లు వేయడానికి వెసులుబాటు ఉండేది.

2018లో 475 గ్రామాల్లో 'వాల్టా'

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లు వరుణుడు పూర్తిగా మొహం చాటేయడంతో వాల్టా గ్రామాల సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. 2018లో ఉమ్మడి జిల్లా పరిధిలోని 44 మండలాల పరిధిలో ఏకంగా 475 గ్రామాలు వాల్టా పరిధిలోకి చేర్చారు. అంటే అప్పట్లో డేంజర్‌జోన్ జాబితాలో 44 మండలాలు చేరాయి. 2017–18 మినహా అంతకు ముందు నాలుగేళ్లూ సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదైంది. దీంతో భూగర్భజలాలు పూర్తిగా క్షీణించిపోయాయి. ఈ క్రమంలో వాల్టా గ్రామాల సంఖ్య భారీగా పెరుగుతూ వచ్చింది. కొత్తగా బోర్లు వేసినా 90 శాతం నీటి చుక్క కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో వ్యవసాయంలో రైతులు బాగా నష్టపోయారు. ఓవరాల్‌గా చంద్రబాబు ఐదేళ్ల హయాంలో వాల్టా గ్రామాల సంఖ్య 350 నుంచి 500 వరకు నమోదు కావడం గమనార్హం. ఈ వ్యత్యాసాన్ని గమనించిన రైతులు 'బాబు హయాం... కరువుకు నిలయం' అంటూ వ్యాఖ్యానిస్తున్నారు.

2019 నుంచి తగ్గుముఖం

2019 మే నెలలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చారు. 2019 ఆగస్టు నుంచి వరుణుడు కరుణించడంతో భారీ వర్షాలు మొదలయ్యాయి. అలా నాలుగేళ్లు కరువు తీరేలా వర్షపాతం నమోదైంది. జిల్లా సాధారణ వర్షపాతం 512.4 మి.మీ కాగా 2019లో 551 మి.మీ, 2020లో 846 మి.మీ, 2021లో 555 మి.మీ, 2022లో 770 మి.మీ వర్షపాతం నమోదు కావడంతో భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి. 2019 మే నెలలో 27 మీటర్లలో ఉన్న భూగర్భజలమట్టం 2019 డిసెంబర్ నాటికి 18 మీటర్లకు చేరుకున్నాయి. అలా క్రమక్రమంగా పైపైకి రావడంతో 2022 నాటికి 6 మీటర్లకు చేరుకోవడం విశేషం. ఎటు చూసినా జలసిరి సంతరించుకుంది. దీంతో ఉమ్మడి జిల్లా పరిధిలో 2019లో వాల్టా గ్రామాల సంఖ్య 375 గ్రామాలు ఉండగా 2020 నాటికి 266 గ్రామాలకు తగ్గింది. అలాగే 2021లో 131 గ్రామాలు, 2022లో 75 గ్రామాలకు... తాజాగా ప్రకటించిన జాబితాలో 48 గ్రామాలకు చేరుకుంది. ఇందులో అనంతపురం జిల్లాలో కేవలం రెండు మండలాల పరిధిలో ఆరు గ్రామాలు ఉండగా, శ్రీసత్యసాయి జిల్లాలో 10 మండలాల పరిధిలో 42 గ్రామాలను చేర్చారు. చంద్రబాబు హయాంలో దుర్భిక్షం, కరువు పరిస్థితులు కారణంగా వాల్టా గ్రామాలు పెరిగిపోగా... గత నాలుగున్నర ఏళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో విస్తారంగా వర్షాలు కురిసి వాల్టా గ్రామాల సంఖ్య భారీగా తగ్గిపోయాయి. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వ్యవసాయం సుసంపన్నమై, రైతుల ఆర్థిక కష్టాలు దూరమయ్యాయి.

గవర్నర్‌ను మర్యాదపూర్వకంగా కలసిన వీసీలు



వర్సిటీ చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జేఎన్‌టీయూ(ఏ) వీసీ డాక్టర్ జీవీఆర్ శ్రీనివాసరావు (చిత్రంలో) రిజిస్ట్రార్ ఆచార్య శశిధర్

అనంతపురం: ఏపీ గవర్నర్, వర్సిటీ చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను జేఎన్‌టీయూ(ఏ) వీసీ డాక్టర్ జీవీఆర్ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్, ఎస్కేయూ వీసీ డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని రాజభవన్‌లో శుక్రవారం గవర్నర్‌ను వారు కలసి పుష్పగుచ్ఛం అందజేసి, మాట్లాడారు.



ఎస్కేయూ వీసీ డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి

క్లుప్తంగా

యుద్ధప్రాతిపదికన పనులన్నీ పూర్తి కావాలి

- పీఆర్ ఎస్ఈ ఈరాస్వామి



జంతలూరు రహదారి పనులు పరిశీలిస్తున్న ఎస్ఈ ఈరాస్వామి, తదితరులు

అనంతపురం సిటీ: సెంట్రల్ యూనివర్సిటీకి వెళ్లే రహదారితో పాటు ప్రహరీ నిర్మాణాలూ సత్వరం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను పంచాయతీరాజ్ ఎస్ఈ ఈరాస్వామి ఆదేశించారు. జిల్లా జైలు నుంచి జంతులూరు(సెంట్రల్ వర్సిటీ) వరకు 3.4 కిలోమీటర్ల మేర రూ.4.40 కోట్ల వ్యయంతో చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణం, రూ.9.15 కోట్లతో తలపెట్టిన సెంట్రల్ వర్సిటీ ప్రహరీ నిర్మాణాలను ఈఈ కేవీకేవీ ప్రసాద్, డీఈ రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఏఈ పాండురంగారెడ్డితో కలసి శుక్రవారం ఆయన పరిశీలించారు. సెంట్రల్ వర్సిటీ ప్రాధాన్యత దృష్ట్యా రహదారిని అందంగా నిర్మించడంతో పాటు నాణ్యతాప్రమాణాలు కచ్చితంగా పాటించేలా చూడాలని ఆదేశించారు. ప్రహరీ నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. నిర్దేశిత గడువులోపు పనులన్నీ పూర్తి చేయాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'పట్టు'లో యాజమాన్యం తప్పనిసరి

ఉరవకొండ: పట్టు పురుగుల పెంపకంలో నూతన యాజమాన్య పద్ధతులు పాటించాలని రైతులకు పట్టు పరిశ్రమ శాఖ జిల్లా అధికారి ఆంజినేయులు సూచించారు. ఉరవకొండ మండలం షేక్షానుపల్లిలో శుక్రవారం నిర్వహించిన పట్టు బడి కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. పట్టు పురుగుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూతన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. మల్బరీ పెంపకానికి ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ22,500, బీసీ, ఓసీ రైతులకు రూ18,750, టైప్1 షెడ్డుకు ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.3.60లక్షలు, బీసీ, ఓసీ రైతులకు రూ3 లక్షల ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఏపీలోని పట్టుగూళ్ల మార్కెట్‌లో పంట ఉత్పత్తులు విక్రయిస్తూ ప్రతి కిలోకు రూ.50 చొప్పున ఇన్సెంటివ్ అందుతుందన్నారు. పట్టు పరిశ్రమ శాఖ ద్వారానే కాక ఉపాధి హామీ పథకం కింద కూడా మరిన్ని పథకాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఓబులేసు, మండల వ్యవసాయాధికారి శుభకర్, సర్పంచ్ లింగన్న, ఎంపీటీసీ రామలింగ, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, ఆర్‌బీకే సిబ్బంది చిక్కన్న, గోపాల్, సురేష్, ఉష, వన్నప్ప పాల్గొన్నారు.

యాటకల్లు ఘటన దురదృష్టకరం

కళ్యాణదుర్గం: శెట్టూరు మండలం యాటకల్లులో ఒకే ఇంట్లో అక్క, చెల్లెలు ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమని అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి డీఎస్పీ బి.శ్రీనివాసులు, సీఐ నాగరాజుతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం ఉదయం తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో యాటకల్లు గ్రామానికి చెందిన చాకలి నారాయణస్వామి, సరస్వతి దంపతుల కుమార్తెలు రూప (20), జ్యోతి (18) వేర్వేరు గదుల్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఆ సమయంలో నారాయణస్వామి, తన భార్యతో కలసి కుర్లపల్లిలో బంధువు అంత్యక్రియల్లో ఉన్నారన్నారు. అక్కడి నుంచి తన కుమార్తె సెల్‌ఫోన్‌కు కాల్ చేసినా వారు లిఫ్ట్ చేయకపోవడంతో అదే గ్రామానికి చెందిన వన్నూరుస్వామికి ఫోన్ చేసి తమ ఇంటి వద్దకెళ్లమని కోరారన్నారు. ఆయన అభ్యర్థన మేరకు ఇంటికెళ్లిన వన్నూరు స్వామి అక్కడ పెద్ద కుమార్తె ఉరి వేసుకున్న విషయాన్ని గుర్తించి వెంటనే నారాయణస్వామికి సమాచారం ఇచ్చాడు. ఆ తర్వాత గణేష్ అనే మరో యువకుడితో కలసి చిన్న కుమార్తె కోసం గాలించగా వంట గదిలో ఆమె కూడా ఉరి వేసుకున్నట్లు గుర్తించారు. అయితే కొంత కాలంగా చిన్న కుమార్తె జ్యోతికి ఫిట్స్‌తో, పెద్ద కుమార్తె తలనొప్పితో బాధపడుతున్నారు. దీంతో తాము ఎవరికీ భారం కాకూడదనుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లుగా తమ ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయిందన్నారు. తల్లి సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు.



మాట్లాడుతున్న అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్ రెడ్డి (చిత్రంలో) డీఎస్పీ బి.శ్రీనివాసులు

చెట్టుపై నుంచి పడి యువకుడి మృతి

కళ్యాణదుర్గం రూరల్: ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గంలోని దొడగట్ట గ్రామానికి చెందిన హరిజన చిన్నరాయుడు(28) స్థానిక జోతిర్మయి కళాశాల సమీపంలోని వ్యవసాయ తోటలో చెట్లు నరకడం కోసం దినసరి కూలి పనికి వెళ్లాడు. చెట్టుపైకెక్కి మిషన్ సాయంతో కొమ్మలు కత్తరిస్తుండగా అదుపు తప్పి కిందపడి, అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.



చిన్నరాయుడు మృతదేహం

శాంతి భద్రతల పరిరక్షణలో 'ఏఆర్' పాత్ర కీలకం

- ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

అనంతపురం: శాంతిభద్రతల పరిరక్షణలో ఏఆర్ విభాగం పాత్ర చాలా కీలకమని ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అన్నారు. జిల్లా సాయుధ పోలీసు బలగాలకు (ఏఆర్) రెండు వారాల పాటు నిర్వహించిన 'డీ మొబలైజేషన్ ' కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ నేపథ్యంలో స్థానిక పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరై, ఏఆర్ సిబ్బంది గౌరవ వందనం స్వీకరించి, మాట్లాడారు. విధులతో పాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. యోగ, వ్యాయామాలు క్రమం తప్పకుండా చేయాలన్నారు. ఉద్యోగంతో పాటు కుటుంబానికీ ప్రాధాన్యతనివ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్ రెడ్డి, హనుమంతు (ఏఆర్), డీఎస్పీలు శ్రీనివాసులు, సీఎం గంగయ్య, బీవీ శివారెడ్డి, మునిరాజ (ఏఆర్), డీసీఆర్‌బీ సీఐ విశ్వనాథచౌదరి, ట్రాఫిక్ సీఐ నారాయణరెడ్డి, ఆర్ఐలు హరికృష్ణ, రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్ పాల్, నాగరాజు, ఆర్ఎస్ఐలు బాలాజీ నాయక్, ప్రవీణ్ కుమార్, మగ్బూల్, రమేష్ నాయక్, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న పోలీసు అధికారులకు సన్మానం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బదిలీపై మరో జిల్లాకు వెళుతున్న జిల్లా పోలీసు అధికారులను శుక్రవారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ఎస్పీ అన్బురాజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఎ.హనుమంతు, అనంతపురం డీఎస్పీ జి.ప్రసాదరెడ్డి, గుంతకల్లు డీఎస్పీ యు.నర్సింగప్ప, ఆర్ఎస్ఐలు ప్రవీణ్‌కుమార్, మగ్బూల్, బాలాజీనాయక్, ముస్తఫాతో పాటు ఉద్యోగ విరమణ చేసిన డీపీఓ సూపరింటెండెంట్ కె.శ్రీనివాసులు, గుంతకల్లు ఏఎస్ఐ శ్రీనివాసులును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో వారందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర రెడ్డి, జి.రామకృష్ణ, డీఎస్పీలు బి. శ్రీనివాసులు, సీఎం గంగయ్య, బీవీ శివారెడ్డి, జి.మునిరాజ (ఏఆర్), ఎస్‌బీ సీఐలు జాకీర్‌హుస్సేన్, ఇందిర, పీసీఆర్ సీఐ దేవానంద్, ఆర్ఐ హరికృష్ణ, డీపీఓ ఏఓ శంకర్, రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, శివప్రసాద్, ఆర్ఎస్ఐలు బాలాజీనాయక్, ప్రవీణ్‌కుమార్, రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ అన్బురాజన్

భార్య కాపురానికి రాలేదని వ్యక్తి ఆత్మహత్య



జైమర్రిస్వామి (ఫైల్)

శెట్టూరు: భార్య కాపురానికి రాకపోవడంతో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... శెట్టూరు మండలం యర్రబొరేపల్లికి చెందిన వడ్డే జైమర్రిస్వామి (35)కి ఎనిమిదేళ్ల క్రితం కర్ణాటకలోని గుండార్లపల్లికి చెందిన శాంతమ్మతో వివాహమైంది. వీరికి కుమారుడు తేజ, కుమార్తె నిత్య ఉన్నారు. రెండేళ్ల క్రితం మనస్పర్థలు తలెత్తడంతో శాంతమ్మ తన పుట్టినింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి భార్యను కాపురానికి పిలుచుకు వచ్చేందుకు పలుమార్లు ప్రయత్నించినా ఆమె సమ్మతించలేదు. దీంతో రెండు రోజుల క్రితం పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించి కాపురానికి రావాలని భార్యను బతిమలాడాడు. ఆమె అంగీకరించకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన జైమరిస్వామి గురువారం రాత్రి తోటకు వెళ్లి అక్కడే ఉండిపోయాడు. శుక్రవారం కుమారుడు ఎంతసేపటికీ ఇంటికి రాకపోవడంతో తండ్రి హనుమంతరాయుడు తోటకెళ్లి పరిశీలించాడు. అప్పటికే మామిడి చెట్టుకు ఉరి వేసుకుని విగతజీవిగా వేలాడుతున్న కుమారుడిని చూసి బోరున విలపిస్తూ సొమ్మసిల్లిపోయాడు. తేరుకున్న అనంతరం విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపడంతో వారు అక్కడకు చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు యర్రబొరేపల్లికి చేరుకుని పరిశీలించారు. హనుమంతరాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మండలాధికారులకు స్థానాలు కేటాయింపు

అనంతపురం అర్బన్/సిటీ: సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లు, ఎంపీడీఓల బదిలీలు జరిగాయి. ఈ క్రమంలో ఇతర జిల్లాల నుంచి అనంతపురం జిల్లాకు వచ్చిన 32 మంది తహసీల్దార్లు, 35 మంది ఎంపీడీఓలకు స్థానాలను కేటాయిస్తూ శుక్రవారం కలెక్టర్ గౌతమి ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా కళ్యాణదుర్గం, గుంతకల్లు రెవెన్యూ డివిజన్ కార్యాలయ పరిపాలనాధికారి (డీఏఓ) స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఈ స్థానాలకు ఇద్దరు తహసీల్దార్లను సీసీఎల్ఏ కేటాయించాల్సి ఉందని అధికారవర్గాలు తెలిపాయి.

స్థానాల కేటాయింపు ఇలా...

మండలం	తహసీల్దార్	ఎంపీడీఓ
అనంతపురం ఆర్డీఓ కార్యాలయ డీఏఓ	పి.పద్మావతమ్మ	---------
కలెక్టరేట్ సూపరింటెండెంట్	డి.రవికుమార్	---------
కలెక్టరేట్ సూపరింటెండెంట్	కె.సతీష్	---------
కలెక్టరేట్ సూపరింటెండెంట్	ఎస్.శ్రీనాథ్	---------
కలెక్టరేట్ సూపరింటెండెంట్	కె.విజయకుమార్	---------
అనంతపురం ల్యాండ్ రిఫారమ్స్	యానది వెంకటేశ్వర్లు	---------
అనంతపురం రూరల్	టీవీ సుబ్రహ్మణ్యం	---------
కళ్యాణదుర్గం	డి.సుధాకరరావు	---------
బొమ్మనహాళ్	రామాంజినమ్మ	---------
యాడికి	టి.జి.మోహనవల్లి	కె.సావిత్రి
రాప్తాడు	టి.సీతారామ్	ఆర్.గీతావాణి
పెద్దపప్పూరు	జీఎం కుమారస్వామి	ఎం.కవిత
రాయదుర్గం	వై.చిట్టిబాబు	టి.అల్లాబక్ష్
కుందుర్పి	బి.హనుమంతు	ఎస్.చంద్రశేఖర్
నార్పల	డి.లక్ష్మీనారాయణ	ఏసీ రాముడు
బీకేఎస్	ఎం.హనుమాన్‌నాయక్	ఎం.శోభారాణి
కంబదూరు	జె.నిత్యానందబాబు	---------
శెట్టూరు	సి.శ్రీదేవి	కె.నరసింహమూర్తి
ఆత్మకూరు	జె.పరమేశ్వరస్వామి	పి.దశరథరామయ్య
విడపనకల్లు	యు.దస్తగిరయ్య	సీవీ కొండయ్య
గార్లదిన్నె	ఎం.లోకేశ్వరి	---------
ఉరవకొండ	సి.కె.శ్రీనివాసులు	---------
బెళుగుప్ప	హెచ్.హరినాథరావు	జీవీ సుబ్బరాజు
యల్లనూరు	మురహరి జయప్రసాద్	---------
గుత్తి	బి.భారతి	ఎం.శ్రీనివాసులు
పామిడి	వి.చంద్రశేఖర్ నాయక్	అల్లమరాజు శ్రీనివాసరావు
కూడేరు	జి.రత్నరాధిక	---------
వజ్రకరూరు	ఎస్.మహమ్మద్ రఫీ	---------
గుంతకల్లు	అల్లూరు శేషఫణి	---------
పెద్దవడుగూరు	కొంగటి కుమారస్వామి	డి.గోపాలకృష్ణ
పుట్లూరు	కె.మల్లికార్జున	ఎం.దస్తగిరి
తాడిపత్రి	కె.ఆంజనేయులు	దీవీ నరసింహరావు
గుమ్మఘట్ట	---------	ఎం.గౌరీదేవి
శింగనమల	---------	బీవీ రమణ

ఏపీ టీచర్స్ జేఏసీ ఏర్పాటు

- ఏపీ సెక్రటరీ జనరల్‌గా పి.అశోక్‌కుమార్‌రెడ్డి
- ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా విష్ణువర్ధన్‌రెడ్డి, సెక్రటరీ జనరల్‌గా ప్రభాకర్



విష్ణువర్ధన్‌రెడ్డి



ప్రభాకర్

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రంలో కొత్తగా ఏపీ టీచర్స్ జేఏసీ ఏర్పాటైంది. రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, ఎంవీ రామచంద్రారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఏపీ టీచర్స్ జేఏసీలో 55 ఉపాధ్యాయ, అధ్యాపక, విద్యాశాఖ సంబంధిత సంఘాలు భాగస్వామిగా ఉన్నాయి. ఉపాధ్యాయ, అధ్యాపక, విద్యాశాఖ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి, చర్చలలో ప్రాతినిథ్యం వహించడానికి ఈ జేఏసీ ఏర్పాటు చేసినట్లు సమాచారం. ప్రభుత్వానికి, ఉద్యోగులకు అనుసంధానకర్తగా ఉంటూ వివిధ సమస్యల పరిష్కారానికి జేఏసీ కృషి చేస్తుందని రాష్ట్ర కమిటీ సెక్రటరీ జనరల్‌గా ఎంపికైన పి.అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గం

అధ్యక్షుడిగా ఎస్. విష్ణువర్ధన్‌రెడ్డి (పీఆర్టీయూ), సెక్రటరీ జనరల్‌గా వి.ప్రభాకర్ (పీడీ అసోసియేషన్), డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఎస్.నాగిరెడ్డి (వైఎస్సార్‌టీఎఫ్), బి.చంద్రశేఖర్‌రెడ్డి (డిగ్రీ కళాశాల అధ్యాపకుల సంఘం), ట్రెజరర్‌గా కుసుమ పుల్లారెడ్డి (అపుస్మా), కో చైర్మన్లుగా వి.ఓబిరెడ్డి, జి.కృష్ణప్రసాద్, ఆర్.లస్కర్‌నాయక్, కె.యల్లప్ప, వైస్ చైర్మన్లుగా ఎ.గోపాల్, సి.గోపాల్‌రెడ్డి, కె.కవిత, కె.బాబయ్య, సెక్రటరీలుగా జి.వెంకటరమణప్ప, వైసీ ప్రసాదరెడ్డి, ఎస్.కృష్ణకుమార్, సి.నాగేంద్రగౌడ్, పబ్లిసిటీ సెక్రటరీగా ఎంవీ శివారెడ్డి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ నూతన అధ్యక్షుడు ఎస్.విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ, అధ్యాపక, ఉద్యోగుల సమస్యలకు పరిష్కారానికి, మధ్యంతర భృతి, 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానం అమలుకు తమవంతు కృషి చేస్తామన్నారు.

తోడల్లుడి హత్య కేసులో నిందితుడి అరెస్ట్

కళ్యాణదుర్గం: తోడల్లుడి హత్య కేసులో నిందితుడిని కళ్యాణదుర్గం పోలీసులు అరెస్ట్ చేశారు. కళ్యాణదుర్గం పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను సీఐ హరినాథ్ వెల్లడించారు. తాడిమర్రి మండలం నిడిగల్లు గ్రామానికి చెందిన మండల సురేంద్ర చెడు వ్యసనాలకు బానిసగా మారాడు. ఈ క్రమంలో తన వ్యసనాలు తీర్చుకునేందుకు అవసరమైన డబ్బు కోసం శెట్టూరు ప్రభుత్వాసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్న భార్య సరస్వతిని తరచూ వేధిస్తుండేవాడు. ఈ విషయంగా దంపతుల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో ఇద్దరికీ సర్దిచెప్పేందుకు తోడల్లుడైన కంబదూరు మండలం డి.చెన్నేపల్లికి చెందిన బోయ చిన్నరాజన్న గత నెల 28న కళ్యాణదుర్గంలోని లిటిల్ రోజెస్ పాఠశాల సమీపంలో నివాసముంటున్న సరస్వతి ఇంటికి చేరుకున్నాడు. సురేంద్రకు సర్ది చెబుతుండగా కోపోద్రోక్తుడైన ఆయన తన భార్యను కత్తితో పొడిచేందుకు ప్రయత్నించాడు. అదే సమయంలో అడ్డుపడిన రాజన్నపై కత్తితో దాడి చేశాడు. తీవ్ర కత్తి పోట్లకు గురైన రాజన్నను కుటుంబసభ్యులు అనంతపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగుళూరుకు తరలిస్తుండగా మార్గం మధ్యలో ఆయన మృతి చెందాడు. దీంతో సురేంద్రపై హత్య కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం ఉదయం కంబదూరు రోడ్డులోని ఓ పెట్రోల్ బంక్ వద్ద తచ్చాడుతున్న నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

చెక్‌పోస్టుల్లో భారీగా నగదు పట్టివేత

రాయదుర్గం: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సరిహద్దు చెక్‌పోస్టుల్లో భారీగా నగదు పట్టుబడుతోంది. శుక్రవారం రాయదుర్గం గాలిమారెమ్మ ఆలయ సమీపంలోని చెక్‌పోస్టు వద్ద కేఎస్ఆర్టీసీ బస్సులో రూ.35.78 లక్షలను సిబ్బంది గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నగదు తరలిస్తున్న కర్ణాటకకు చెందిన బసవరాజును అదుపులోకి తీసుకున్నారు. అలాగే డి హిరేహాళ్ మండలం సోములాపురం చెక్‌పోస్టు వద్ద నాగలాపురం గ్రామానికి చెందిన హేమరెడ్డి కారులో రూ.24 లక్షల నగదు పట్టుబడింది. దీనిపై సమగ్ర విచారణ జరిపిన పోలీసులు రాయదుర్గం డీటీ సురేష్, డి.హీరేహాళ్ తహసీల్దార్ బాలఈశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. రెండు ప్రాంతాల్లోనూ పట్టుబడిన నగదు రైతులకు సంబంధించినది విచారణలో తేలడంతో తిరిగి వారికే స్వాధీనం చేసినట్లు రూరల్ సీఐ ప్రసాద్‌బాబు తెలిపారు.

క్లుప్తంగా

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న మైనార్టీ సంక్షేమశాఖ ఏడీ రామసుబ్బారెడ్డి

అనంతపురం రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తామని మైనార్టీ సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఇటీవల మైనార్టీ సంక్షేమశాఖ ఏడీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన శుక్రవారం సాక్షితో మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సిబ్బంది సహకారంతో సమష్టిగా పని చేయాలన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే సీఎం జగన్ ధ్యేయం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ సుజాత

ఆత్మకూరు: ప్రజారోగ్య పరిరక్షణమే సీఎం వైఎస్ జగన్ ధ్యేయమని జగనన్న ఆరోగ్య సురక్ష జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ సుజాత పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మరూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె ఆకస్మికంగా పరిశీలించారు.ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్న ధృడ సంకల్పంతో వైద్య రంగంలోనూ విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టడం పేద ప్రజలు చేసుకున్న అదృష్టమన్నారు. కార్యక్రమంలో డీపీఎంఓ రవిశంకర్, వైద్యాధికారి శివ కృష్ణ, సీహెచ్ఓ శివప్రసాద్,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి నగరోత్సవం



నగర వీధుల్లో వాసవీమాత నగరోత్సవం

అనంతపురం కల్చరల్: ఆర్యవైశ్యుల ఆరాధ్యదేవత వాసవీ కన్యకా పరమేశ్వరి నగరోత్సవం నగర వీధుల్లో శోభాయమానంగా సాగింది. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి మాలధారణను పురస్కరించుకొని అమ్మవారిశాల ఆలయ అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు ఆధ్వర్యంలో వందలాది దీక్షాపరులతో శుక్రవారం సాయంత్రం భారీ ఎత్తున సాగిన నగరోత్సవం జరిగింది. అనంతరం కొత్తూరు అమ్మవారి శాల నుంచి వైశ్యాహాస్టల్, తిలక్‌రోడ్, గాంధీబజార్, సుభాష్‌రోడ్డు మీదుగా ఆలయానికి చేరుకుంది.

ఎంపీడీఓలకు సన్మానం



ఎంపీడీఓలను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

ఆత్మకూరు: ఎంపీడీఓ రఘునాథ్, నూతన ఎంపీడీఓ దశరథ రామయ్యకు ఎంపీపీ హేమలత, కార్యాలయ సిబ్బంది శుక్రవారం సన్మానం చేశారు. ఆత్మకూరు ఎంపీడీఓ రఘునాథ్ బదిలీ అయ్యారు. ఇక్కడికి కర్నూలు జిల్లా నందవరం నుంచి బదిలీపై వచ్చి, శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీ అయిన ఎంపీడీఓకు వీడ్కోలు పలుకుతూ ఉపాధి సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది సన్మానించారు. నూతన ఎంపీడీఓ దశరథరామయ్యకు పుష్పగుచ్ఛం అందించి, స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏపీఓ పుష్పా, జయరాం, పంచాయతీ సెక్రటరీలు ఖాదర్‌వలి, బాబా సాహెబ్, మల్లేష్, కీర్తన, శిరీష, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

రాప్తాడు: అనంతపురం పుష్పగిరి కంటి ఆసుపత్రి నిర్వాహకులు, బీజేపీ నియోజకవర్గ కోకన్వీనర్ కృష్ణమరెడ్డిపల్లి కాటమయ్య సహకారంతో ఉచిత కంటి వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు సుమతి, అనంతపురం బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ లలిత్ కుమార్, రాయలసీమ జోనల్ ఇన్‌చార్జి సూర్యప్రకాష్ రెడ్డి , బీజేపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు గొంది అశోక్ కుమార్ కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కంటి వైద్యశిబిరానికి 120 మంది హాజరయ్యారు. వీరిలో 50 మంది శస్త్రచికిత్సలకు ఎంపిక య్యారు. కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అజయ్ యాదవ్, మండల యువ మోర్చా అధ్యకులు గంజి కేశవ సాయి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి మద్దతు ఇవ్వండి

- ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, శంకరనారాయణ



అంబేడ్కర్‌నగర్‌లో ఇంటింటికీ వైఎస్సార్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, శంకర్‌నారాయణ



అంబేడ్కర్‌నగర్‌లో సీసీ రోడ్డును ప్రారంభించిన ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, శంకరనారాయణ, మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి అందివ్వని సుపరిపాలన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించారని, సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు తీసుకెళ్లారని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామి రెడ్డి, పార్లమెంట్ సమన్వయకర్త, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని 21వ డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ నగర్, మున్నానగర్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్లమెంట్ సమన్వయకర్త సమన్వయకర్త శంకర్‌నారాయణతో కలిసి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలకు సంబంధించిన కర పత్రాలను ప్రజలకు అందించారు. ప్రభుత్వం చేసిన మేలుకు తాము రుణపడి ఉంటామని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేస్తామని స్థానికులు ఎమ్మెల్యే అనంతకి తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉంటేనే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగుతాయన్నారు. 2014 ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను విస్మరించారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నవరత్నాల ద్వారా పేద కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు.

అంబేడ్కర్ నగర్‌లో రూ.1.50 కోట్ల అభివృద్ధి:
ప్రజారోగ్యం కోసం శ్రమించే కార్మికులు అధిక సంఖ్యలో అంబేడ్కర్ నగర్‌లోనే ఉంటున్నారని, కానీ గత పాలకులు కార్మికులు నివసించే ప్రాంతాన్ని విస్మరించారని ఎమ్మెల్యే విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి డివిజన్‌లో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అంబేడ్కర్‌నగర్, మున్నానగర్‌లో రూ.1.50 లక్షల (రూ.కోటిన్నర) అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గతంలో నడవడానికి వీల్లేని పరిస్థితుల్లో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడేవారన్నారు. ఇంకా టెండర్ ప్రాసెస్‌లో మరో రూ.కోటి అభివృద్ధి పనులున్నాయని, రానున్న రోజుల్లో వాటి పనులు పూర్తి చేసి ఈ ప్రాంతం ముఖ చిత్రం మార్చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమం:
సీఎం జగనన్న నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమం జరిగిందని ఎమ్మెల్యే అన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజలు పడ్డ కష్టాలు, తమ ప్రభుత్వంలో ప్రజలు జరిగిన మేలు అందరికీ తెలుసన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్షానే ప్రజలుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, కార్పొరేటర్లు సాకే చంద్రలేఖ, రాజేశ్వరి, జయలలిత, సుమతి, బాలాంజనేయులు, ఇసాక్, డైరెక్టర్లు శ్రీనివాసులు, శోభారాణి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, కొర్రపాడు హుస్సేన్ పీరా, సైపుల్లాబేగ్, శ్రీదేవి, కృష్ణవేణి, పార్టీ సీనియర్ నేతలు అనంత చంద్రారెడ్డి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, చింతా సోమశేఖర్ రెడ్డి, నాయకులు పెన్నోబులేసు, లక్ష్మణ్, సాకే కుళ్లాయస్వామి, వనారస బలరాం, అనిల్‌కుమార్ గౌడ్, మల్లెల వేణుగోపాల్, రామయ్య, ఇలియాజ్, తలారి వెంకటేష్, కోనారాజారెడ్డి, తబ్రేజ్, ఇదయ్‌తుల్లా,హేమకిరణ్, అంజలి, దేవి, అంకిరెడ్డి ప్రమీళ, భారతి, శోభాబాయి, తదితరులు పాల్గొన్నారు.

నేడు పాతూరు పవర్ ఆఫీస్ ప్రాంతంలో..
నగరంలోని పాతూరు పవన్ ఆఫీస్ ప్రాంతంలో శనివారం ఉదయం 7:30 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, హాజరుకావాలని పిలుపునిచ్చారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

అనంతపురం రూరల్: అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఏ నారాయణపురంలో శనివారం పర్యటిస్తారని వైఎస్సార్‌సీపీ రూరల్ మండల కన్వీనర్ హుస్సేన్ ఓ ప్రటనలో తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు పంచాయతీ పరిధిలోని డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా నాల్గో విడత కార్యక్రమం ఉంటుందన్నారు. శనివారం ఉదయం 11 గంటలకు ఏ నారాయణపురం మసీదు వద్ద కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరుకావాలన్నారు.

వీఆర్ఎస్ తీసుకున్న తహసీల్దారు శ్రీధర్

అనంతపురం అర్బన్: కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారిగా ఉన్న కె.శ్రీధర్ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ (వీఆర్ఎస్) తీసుకున్నారు. వ్యక్తిగత కారణాలతో ఆయన దీర్ఘకాలిక సెలవు తీసుకున్నారు. ఇదే సమయంలో ఆయన వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆయన అభ్యర్థనను ప్రభుత్వం ఆమోదించి, వీఆర్ఎస్‌కు అనుమతి ఇచ్చింది. దీంతో ఆయనను కార్యాలయం సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికింది.

జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక

ఆత్మకూరు: పి.యాలేరులో ఈ నెల 4న అండర్ - 23 బాలుర క్రికెట్ జిల్లా టీమ్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సూపర్ సెవెన్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి అఖిల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపిక అయిన బాలుర జట్టుకు మద్దికేరలో జరగనున్న రాష్ట్ర స్థాయి అండర్ - 23 సూపర్ సెవెన్ క్రికెట్ పోటీల్లో పాల్గొంటారన్నారు. మరింత కోసం సెల్: 9581060905, 9014033307లో సంప్రదించాలని కోరారు.

దాతల చేయూతతో పునర్జన్మ



జిల్లా ఎస్పీకి అభినందనలు తెలుపుతున్న కానిస్టేబుల్ ఎన్.రవికుమార్

అనంతపురం: దాతల సహకారంతో కిడ్నీ మార్పిడి విజయవంతంగా పూర్తి చేసుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్న కానిస్టేబుల్ రవికుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌ను కలిసి శుక్రవారం కృతజ్ఞతలు తెలియజేశారు. కానిస్టేబుల్ రవికుమార్ మాట్లాడుతూ ఆర్టీటీ రూ.10 లక్షలు, జిల్లా వ్యాప్తంగా పోలీసులు ఆర్థిక సాయం చేశారని, ఎస్పీ చొరవ తీసుకొని తనకు పునర్జన్మ ప్రసాదించారన్నారు. ఆయన కుటుంబ సభ్యులు కూడా ఎస్పీకి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో డీసీఆర్బీ సీఐ విశ్వనాథ చౌదరి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్ రెడ్డి, గాండ్ల హరినాథ్, శివప్రసాద్ పాల్గొన్నారు.

బాబు అబద్ధపు హామీలు నమ్మకండి



కనగానపల్లి మండలం ముత్తువకుంట్లలో జరిగిన వైఎస్సార్ ఆసరా సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



ముత్తువకుంట్లలో జరిగిన వైఎస్సార్ ఆసరా సంబరాల్లో పాల్గొన్న డ్వాక్రా సంఘాల సభ్యులు

- వైఎస్సార్ ఆసరా సభలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: అధికారం కోసం టీడీపీ నేత చంద్రబాబు చెప్పే అబద్ధపు హామీలను ఎవరూ నమ్మొద్దని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని ముత్తువకుంట్లలో జరిగిన వైఎస్సార్ ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముత్తువకుంట్ల, తల్లిమడుగుల గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల సమయంలో అక్కచెల్లెమ్మలకు ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా రుణాలన్నీ నాలుగు విడతల్లో మాఫీ చేశారన్నారు. అమ్మఒడి, వైఎస్సార్ చేయూత ద్వారా రూ.2.5 లక్షల కోట్ల మహిళ ఖాతాల్లో జమ చేశారన్నారు. కానీ చంద్రబాబు 2014 ఎన్నికల ముందు 600 హామీలు ఇచ్చి, ఏ ఒక్క హామీనీ నెరవేర్చకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశాడన్నారు. ప్రజలు గత చంద్రబాబు అబద్ధాల పాలన, ప్రస్తుతం జగనన్న సంక్షేమ పాలనను బేరీజు వేసుకొని వచ్చే ఎన్నికల్లో ఓటు వేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతా నియోజకవర్గంలో ఐదేళ్లలో 50 వేల పింఛన్లు, 15 వేల ఇళ్లు, 2 వేల మంది రైతులకు బోర్లు వేయించామన్నారు. పేరూరు డ్యాంకు కృష్ణ జలాలు తెచ్చామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంత్రి పథకం ఏసీ రామేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీప్రసాద్, డైరెక్టర్ ప్రభాకర్, ఏపీఎం హేమలత, ఈఓఆర్డీ అనిల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, డ్వాక్రా సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడుగుల ఆశాజ్యోతి సీఎం వైఎస్ జగన్
రామగిరి: కుల, మత, ప్రాంతాలకతీతంగా అన్ని వర్గాలకు సమ న్యాయం చేసింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తిమ్మాపురం, పేరూరు, నసనకోట, రామగిరిలలో జరిగిన 'వైఎస్సార్ ఆసరా' చెక్కు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో టీడీపీ ప్రజలను మభ్యపెడుతూ అమలు చేయలేని హామీలు ఇస్తుందన్నారు. నియోజకవర్గంలో పరిటాల కుటుంబ సభ్యులు 20 ఏళ్లకుపైగా మంత్రులు, ఎమ్మెల్యేలుగా పదవులు అనుభవించి, అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. ఎన్నికల సమయంలో హామీలిచ్చి అనంతరం గ్రామాల్లో తిరగకుండా సొంత పనులపై దృష్టిపెట్టి దోచుకొని దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారన్నారు. 20 ఎకరాల నుండి రెండువేల ఎకరాలతోపాటు భారీగా ఆస్తులు కూడబెట్టుకొని, ప్రజలను విస్మరించారన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై తోపుదుర్తి కుటుంబం దృష్టి సారించి, ఈ ప్రాంతంలో సొంత డబ్బుతో బోర్లు వేయడం,పేదలకు గొర్రెల పంపిణీ చేయడం, చిరువ్యాపారులకు ఆర్థిక సాయం అందించడం చేశామన్నారు. పేరూరు డ్యాంకు హంద్రీనీవా నీరు తెచ్చి, రాప్తాడు నియోజకవర్గ వ్యాప్తంగా చెరువులకు నీరు నింపినట్లు తెలిపారు. రామగిరిలో ముత్యాలమ్మ ఆలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి తీసుకురావడంతో పాటు బంగారు గనులను తెరిపించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. రాబోవు ఎన్నికల్లో మరోమారు పార్టీని అధికారంలోకి తెచ్చుకునేందుకు అందరం నడుం బిగిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం మహిళలకు వైఎస్ఆర్ ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. పేరూరులో వెన్నెముక సమస్యతో బాధపడుతున్న శ్రీనివాసులుకు రూ.5 లక్షల సీఎం రిలీఫ్ పండ్ చెక్కును అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మీనుగ నాగమ్మ, జెడ్పీటీసీలు నాగార్జున, మారుతీ ప్రసాద్, మండల కన్వీనర్లు కర్రా హనుమంతరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, నాయకులు మీనుగ నాగరాజు, రాజేష్, గంగుల సుధీర్‌రెడ్డి, ఆదిరెడ్డి, నరసింహారెడ్డి, వెంకటరెడ్డి, రామ్మూర్తి, జేష్ఠ రామయ్య, రామలింగారెడ్డి, బండారు అనిల్, రామాంజనేయులు పాల్గొన్నారు.



రామగిరి మండలం పేరూరులో వైఎస్సార్ ఆసరా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

శ్రీనివాస్ చౌదరి ఆశయాలు కొనసాగిస్తాం



శ్రీనివాస్ చౌదరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించిన శ్రీనివాస్ చౌదరి ఆశయాలను కొనసాగిస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రధాన గేటు ముందు శ్రీనివాస్ చౌదరి 39వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్ బాబు హాజరయ్యారు. జాన్సన్ బాబు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్య కుల్లాయస్వామి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఉమామహేష్, వంశి, మంజునాథ్, రారాజు, హరికృష్ణ, విశ్వ, సాయి, రాజేష్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు వ్యక్తుల ఆత్మహత్యాయత్నం

అనంతపురం : నగర పరిధిలో ఇద్దరు వ్యక్తులు శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేశారు. వివరాలు.. టీవీ టవర్ సమీపంలో నివాసం ఉంటున్న మర్రి స్వామి అనే వ్యక్తి తన భార్యతో గొడవపడి, గాజు సీసాతో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నం చేశాడు. నగర శివారులోని రాజీవ్ కాలనీకి చెందిన రవి అనే వ్యక్తి తన భార్యతో ఘర్షణకు పాల్పడి బ్లేడుతో గొంతు కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర రక్తస్రావంతో ఉన్న వారిని గమనించిన స్థానికులు అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యారంగానికి అన్యాయం

అనంతపురం టవర్‌క్లాక్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని పీడీఎస్‌యూ (ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం) జిల్లా కార్యదర్శి శ్రీనాథ్ యాదవ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో దేశ ఆర్థిక శాఖ మంత్రి వాస్తవాలకు దూరంగా మాట్లాడటం బాధాకరమన్నారు. బీజేపీ అధికారంలోకొచ్చాక విద్యార్థులు చదువుకు దూరమయ్యారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, కేంద్రీయ పాఠశాలలు నవోదయ పాఠశాలల్లో కనీస సదుపాయాలు లేవన్నారు. నూతన జాతీయ విద్యా విధానం 2020 పేరుతో విద్యా రంగానికి ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్ర చేస్తోందన్నారు.

అదనపు కమిషనర్ శ్రీహరి బాబు బాధ్యతల స్వీకరణ

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా పీ శ్రీహరిబాబు శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. అంతకుముందు ఆయన కమిషనర్ మేఘస్వరూప్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌కు ఆయన పుష్పగుచ్ఛం అందించారు. కదిరి కమిషనర్‌గా ఉన్న శ్రీహరిబాబు బదిలీలో భాగంగా అనంతపురం నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా నియమితులైన విషయం విదితమే.

డిప్యూటీ కమిషనర్ రిలీవ్:
నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ సావిత్రి శుక్రవారం రిలీవ్ అయ్యారు. ఇటీవల డీసీ సావిత్రిని మెప్మా ప్రధాన కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. నెల్లూరు జిల్లా గూడూరు కమిషనర్‌గా ఉన్న వెంకటేష్‌ను నగరపాలక సంస్థ డీసీగా నియమించింది. ఆయన మరో రెండు రోజుల్లో బాధ్యతలు తీసుకోనున్నారు.

నేడు 'వైఎస్సార్ ఆసరా' సంబరాలు

కనగానపల్లి: మండలంలోని కనగానపల్లి, యలకుంట్ల, తగకుంట, మద్దెలచెరువు, చంద్రాశ్చర్ల, మామిళ్లపల్లి గ్రామాల్లో శనివారం వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహిస్తామని ఏపీఎం హేమలత తెలిపారు. ఈ సంబరాలకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

ఘంటసాల మధురగీతాల పాటల పోటీలు

అనంతపురం టవర్‌క్లాక్: ఘంటసాల వర్ధంతి సందర్భంగా రా ఇంటర్నేషనల్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ఘంటసాల మధురగీతాల పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు సింగర్ సుధాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 11న ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకొని విజేతలకు అవార్డులు అందిస్తామన్నారు. గాయకులు శనివారం నుంచి ఆన్‌లైన్‌లో ఒక పల్లవి, ఒక చరణం పంపాలని, ఈనెల 10న లలిత కళాపరిషత్‌లో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి ఉన్న వారు 9666114810, 9493561298 నంబర్లకు సంప్రదించాలన్నారు.

అభాగ్యులకు 'అమ్మ'సాయం



సాయం అందిస్తున్న అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి

ఆత్మకూరు: మండలంలోని పాంపంపల్లికి చెందిన రెండు కుటుంబాలకు అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి శుక్రవారం ఆర్థికసాయం అందించారు. పాపంపల్లికి చెందిన నందిని, అశ్విని అనే మహిళల భర్తలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. వీరికి ఆరేళ్ల ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కుటుంబ పెద్దలు మృతిచెందడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. కుటుంబాలు దీన స్థితిలో ఉండగా, అమ్మ సంస్థ రమణారెడ్డి విషయం తెలుసుకున్నారు. నలుగురు పిల్లల చదువు, కుటుంబ పోషణ నిమిత్తం రూ.60 వేల విలువగల నిత్యావసరాలు, దుస్తులు అందించారు. రూ.20వేలు నగదు అందించారు.

మృతుడి కుటుంబానికి అండగా నిలిచాం



మృతుడి కూతురుకు నాన్ పీహెచ్ వర్కర్‌గా నియామక పత్రాన్ని అందిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: మృతుడి కుటుంబానికి అండగా నిలిచామని మేయర్ వసీం పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థలో మేయర్ వసీం, కమిషనర్ మేఘ స్వరూప్ నగరంలోని యువజన కాలనీకి చెంది వడ్డే వరలక్ష్మికి నాన్ పీహెచ్ వర్కర్‌గా నియామక పత్రం అందించారు. వివరాలు.. గతేడాది జనవరి 13న యువజన కాలనీ చెందిన వడ్డే సంగప్ప (55) నగరపాలక సంస్థకు చెందిన చెత్త వాహనం కింద పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మేయర్ వసీం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆదేశాలతో మృతుడికుటుంబాన్ని పరామర్శించి, ఆదుకుంటామని తెలిపారు. ఈ క్రమంలో మృతుడు వడ్డే సంగప్ప కుమార్తె వడ్డే వరలక్ష్మికి నాన్ పీహెచ్ వర్కర్‌గా ఉద్యోగావకాశం కల్పించారు. మేయర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతోనే మృతుడి కుటుంబానికి మానవతా దృక్పథంతో ఆదుకున్నట్లు తెలిపారు. తమ పాలకవర్గంలో కార్మికుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మృతి చెందిన కార్మికుల కుటుంబీకులకు కారుణ్య నియామకాలు ఎప్పటికప్పుడు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే కార్మికుల హెల్త్ స్క్రీనింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వరలక్ష్మి, వారి కుటుంబ సభ్యులు మేయర్ వసీం, కమిషనర్ మేఘ స్వరూప్, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు, కార్పొరేటర్ సైపుల్లాబేగ్, పార్టీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

అనంతపురం: నగరంలోని శ్రీనివాసనగర్ సైపుల్లా బ్రిడ్జి కింద పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు త్రీటౌన్ సీఐ ధరణీబాబు శుక్రవారం తెలిపారు. పేకాట రాయళ్ల నుంచి రూ.41,770 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కొన్ని రోజులుగా యథేచ్ఛగా పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సౌత్ ఇండియా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ

గుత్తి: సౌత్ ఇండియా వైజ్ఞానిక ప్రదర్శనలో గుత్తి కోట ఉన్నత పాఠశాల విద్యార్థులు బెన్నీ, మహేంద్ర రెడ్డి ప్రతిభ చాటారు. గత నెల 27 నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు విజయవాడలో సౌత్ ఇండియా వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. శుక్రవారం కోట ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఆటో బోల్తా.. 13 మందికి గాయాలు

గుత్తి రూరల్: కరిడికొండ గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం ఆటో అదుపు తప్పి 13 మందికి గాయాలయ్యాయి. వివరాలు.. ప్యాపిలికి చెందిన రామంజినమ్మ, సంజమ్మ, లక్ష్మీదేవి, రామాంజినమ్మ, చిన్న ఓబులేసు, నారాయణమ్మ, ఖాసీం, అదెన్న, శకుంతల, నాగరాజు, జయమ్మ, సుబ్రమణ్యం, సూర్యుడులు పని నిమిత్తం ఆటోలో గుత్తి వైపునకు వెళ్తేండగా ప్రమాదం జరిగింది.